

సంస్కరణ

గురజాడ శోభాపేరిందేవి

బస్‌స్టాప్‌లో నిలబడింది మిత.

ఆమెతోపాటే అలా ఎందరో నిలబడి ఉన్నారు.

వాళ్ళందరికీ బస్సు ఇంకా రాలేదే అని విసుగ్గా ఉంది. ఇంటికెళ్ళాలన్న తొందరా ఉంది.

కాని మితకి ఆ రకమైన తొందర లేదు.

తను త్వరగా ఇంటికి వెళ్తే తనకి లభించేదేమిటి? తనకోసం ఎవరు ఎదురు చూస్తారు?? రాలేదని ఎవరు బాధపడతారు???

సరిగ్గా రెండేళ్ళ క్రితం ఇదే బస్‌స్టాప్‌లో నిలబడేది తను. అప్పుడన్నీ తొందరే। త్వరగా తయారై కాలేజీకి వెళ్ళాలని, కాలేజీ అవుతూనే ఇల్లు చేరాలని.

అప్పుడు జీవితం పూలనావలో ప్రయాణిస్తున్నట్టుండేది. కాని ఇప్పుడు చీకట్లో తడుముకుంటూ నడుస్తున్న భావన.

ఏడాది క్రితం తను వధువు.

ఏడాది పూర్తవగానే విధవ।

చుట్టూ ఉన్న మనుష్యుల్ని, అక్కరకు రాని చుట్టాల్లాగ వచ్చిపోతున్న బస్సుల్నీ స్పష్టంగా కనపడనివ్వక మసకగా చేసింది కంటికి నిండుగా చేరిన కన్నీటి పొర.

అసలు తన పెళ్ళిఫోటోలోనే కొన్ని

రాలేదు. పెళ్ళినాటి పట్టుచీర మరోసారి కట్టనేలేదు. పెళ్ళినాడు తొడుక్కున్న ఆ ఎఱ్ఱటి మట్టిగాజులు మక్కువగా తొడగనైనా తొడగలేదు. కాసులు, పగడాలు కలిపిన నల్లపూసల గొలుసు ఫ్యాషన్ అని అర్డర్ చేసింది తను. అదింకా తన అరచేతికి అందనేలేదు. అయినా తన జీవితం అంతమైపోయింది.

విరక్తిగా నవ్వుకుంది మిత.

భర్త చనిపోతే భార్యకి భవిష్యత్తు చచ్చిపోతుంది. వర్తమానం చచ్చిపోతుంది. ఆమెకి మిగిలి ఉండేది ఉండవలసినది గతకాలపు తలపులే!

మనువు మాటల్నే వేదంలా భావించే ఈ సమాజంలో ఇంకెన్ని అంశాలో! అదే మగవాడి విషయంలో వేరు.

భార్యపోతే అతని గతం చచ్చిపోయినట్టే లెక్క. వర్తమానం ఉత్సాహంగా ఉంటుంది. అవును మరి భవిష్యత్తులో అతనో పెళ్ళికొడుకు! అతనికి ఎంత వయసొచ్చినా అదే పద్ధతి.

బస్సు బద్ధిగా వచ్చింది.

మిత బస్సెక్కింది.

విపరీతమైన రద్దీగా వచ్చి ఆగిన బస్సులోంచి దిగినవారికంటె ఎక్కిన వారే ఎక్కువగా ఉండడంతో బస్సులో త్రొక్కిసలాటగా ఉంది.

బస్ దిగాక ఓ మైలు దూరం నడిచి ఇల్లు చేరింది.

ఆశ్చర్యం కలిగించేలాగ ఇంటిల్లిపాదీ ఒకే గదిలో కూర్చుని ఉన్నారు.

దీర్ఘాలోచనల్లో ఉన్నట్లున్నాయి వాళ్ళ ముఖాలు.

'ఏమిటి విశేషం?' అని మిత అడగలేదు. అసలామెకి తనంత తానుగా ఏ విషయంలోనూ జోక్యం చేసుకునే ఆసక్తి పోయింది.

అదీకాక ఎంత వద్దనుకున్నా వాళ్ళ కళ్ళల్లో 'నీ కెందుకు?' అన్న ప్రశ్న! ఎంతలేదన్నా తనంటే వాళ్ళకి చిన్నచూపే!

తను సంపాదిస్తోంది. సంపాదించినదంతా వాళ్ళకోసం ఖర్చుపెడుతోంది. అయినా చిన్నచూపే!

తన భర్తపోయాడు కదూ అందుకే ఆ చిన్న చూపు!

భర్త చనిపోతే భార్యనికూడా చంపేరాలన్న పద్ధతి మన సమాజంలో బాగా పాతుకుపోయి ఉంది. చట్టం ఒకటి అడ్డు రావడంతో ఆ పని మానేసారు.

కాని చంపాలన్న బుద్ధి ఎక్కడికి పోతుంది? కాని హత్య చేయలేరు. అందుకే మనసుని ముక్కలు ముక్కలుగా నరికి పారేస్తున్నారు.

మిత తలవంచుకుని తన గదివైపుకు నడవసాగింది.

"మితా! ఇలారా!"

మిత తప్పనిసరిగా వాళ్ళ దగ్గరికి నడిచింది.

"కూర్చో!"

కూర్చుంది. ఈసారి ఆమె చూపు నేలనంటుకుపోలేదు.

అదర్శవాది అయిన అన్నవైపు, ఆంధ్రుల అభిమాన రచయిత్రి అయిన వదినవైపు అన్నకీ వదినకీ అన్ని విధాలా సహకరించే అమ్మానాన్నల వైపూ సాగింది.

"మీ మామగారు ఉత్తరం రాసారు" అన్నాడు తండ్రి.

మిత ముఖంలో ఏ భావమూ లేదు.

"నిన్నక్కడికి రమ్మన్నారు". అంది తల్లి.

"కాదు వచ్చి తీరాలని శాసించారు" అన్నాడు తండ్రి.

మిత కనురెప్పల్ని మౌనంగా కోరుకుంది 'దయచేసి నా కన్నీళ్ళను జారిపోనివ్వక అడ్డుకుని కాపాడండి. అందరిముందూ అనుక్షణం ఏడవలేను. ఆ కారణంవల్ల సానుభూతిని అందుకోలేను' అని!

కనురెప్పలకి జాలి లేదో ఏమో కన్నీటిబిందువు మెల్లి మెల్లిగా జారిపోయింది.

"ఆడపిల్ల ఉద్యోగం చేయడం తమ ఇంటా వంటా లేదుట. తమ కోడలు ఉద్యోగం పేరిట గడపదాటడం తమకి అమోదయోగ్యం కాదట," అంది కోపంగా వదిన.

"కన్నవారికంటె అత్తవారికే నీమీద హక్కుందని కనక నువ్వు వారిదగ్గర ఉండడమే సబబు" అంది తల్లి.

దీన్ని ఛాందసుల ఇంట్లో పడేయ వద్దని నెత్తినోరు మొత్తుకున్నా మీరు వినలేదు నిప్పును కడిగే వంశమని పేరొకటి. స్ట్రీట్‌కి వెళ్తే చాలు కాళ్ళు కడుక్కోడం చాలక స్నానం చేసి తీరాలిట. ఎవరికైనా విరోచనాలు వచ్చినా అంతే! తడిబట్టతో చలికాలం సైతం వంటచేయడం, ఎవరైనా వస్తే చాలు తలుపుచాటుకు తప్పుకోడం, దేముడికి నైవేద్యం పెడితేకాని పిల్లలకైనా వచ్చి మంచినీళ్ళు సైతం పట్టకపోడం", అన్నాడు అన్న.

"ఒక్కడే కొడుకని చేసాం కదురా" అంది తల్లి.

"అందుకేగా అంత కట్నం పోసింది" అన్నాడు తండ్రి.

మిత వింటూ కూర్చుంది.

అసలు ఆడపిల్లకి చెప్పినట్టు చేయడమే పని!

"అందుకే నాకు ఎమ్మే చేయాలనుంది నాన్నా!" అంటున్నా "అవన్నీ

పెళ్ళయ్యాక నీ భర్త అనుమతితో చెయ్యి" అంటూ కొట్టిపారేసారు.

మితకి అన్నా వదినలంటే మాత్రం గౌరవం ఉంది

తాపీ మాత్రం అయినా మిగిలి ఉంది అంటే దానికి వెనకనున్నది వాళ్ళిద్దరే!

"నాకు మాత్రం నిన్ను పంపటం ఇష్టం లేదే! నిన్ను వాళ్ళో జీతంబత్తెం లేని వంటమనిషిగానూ, పనిమనిషిగానూ మార్చేస్తారు. నీ అవతారం మారిపోతుంది. గుండు గొరిగించినా ఆశ్చర్యపోనవసరం లేదు" అన్నాడు అన్న!

"మీ ఇష్టం అన్నా! మీ రెలా చెప్తే అలా వింటాను" అంది మిత లేచిపోతూ!

"ఉత్తరం తీసుకెళ్ళు మితా! చదువుకో!" అంది ఉత్తరాన్ని అందిస్తూ వదిన.

మిత ఉత్తరాన్నందుకుని తన గదిలోకి నడిచి లోపల గడియ పెట్టుకుంది. కాస్త రిలీఫ్‌గా అనిపించింది. ఎందుకో మునపటిలాగ నలుగురిమధ్య నిముషంసేపైనా ఉండలేకపోతోంది.

కాస్సేపు ఎటో చూస్తూ కూర్చుండిపోయింది.

తరువాత ఉత్తరాన్ని అందుకుంది.

మా కోడలైన మితకి,

ఆశీర్వదించి వ్రాయునది. మా అన్నయ్యగారూ, వదినగారూ కూలాసాగా ఉన్నారని తలుస్తాను. మీ అన్నయ్యగారూ వదినగారూ కూడా క్షేమమే కదా!

నువ్వు మా అబ్బాయి పోయిన పన్నెండో రోజున నీ పుట్టింటికి వెళ్ళావు. కష్టం వచ్చినప్పుడు పుట్టింటికి వెళ్ళడం సహజమే! కాదనము. కాని నువ్వు వెళ్ళి ఆరునెలలైపోతున్నా ఇంకా తిరిగి రాకపోవడం మాత్రం బాగులేదు. కనీసం ఒక్క ఉత్తరమైనా నీ నుండి రాలేదు. ఎక్కడి వాళ్ళు అక్కడే ఉండాలి. ఎంత కష్టం వస్తేమాత్రం ఎన్నాళ్ళని పుట్టింట్లో ఉంటావు? అదీకాక నువ్వు ఉద్యోగంలో చేరావని తెలిసింది. అది మా ఇంట్లో కోడలు చేయరానిది. మాకది ఏ మాత్రమూ ఇష్టం లేదు. కనక వెంటనే దానికి రాజీనామా చేసితీరాలి. ఆపైన నువ్వు వీలుపడినంత త్వరగా ఇక్కడికి రావాలి. ఏ విధంగా చూసినా నువ్వు ఇక్కడ మాతో ఉండడమే సముచితంగా తోస్తోంది.

ఆశీస్సులతో అత్తమామ.

అలాంటి మరో ఉత్తరం తండ్రికి కూడా రాసి ఉంది.

మిత మోకాళ్ళలో ముఖం దాచుకుంది.

గుండె మండిపోతోంది ఉత్తరంలోని

సారాంశానికి.

కడుపు మండిపోతోంది అకలి అధికం కావడంవల్ల!

కాని మిత అలాగే కూర్చుంది పోయింది ఆమెని ఎవ్వరూ ఓదార్చడానికి రాలేదు. అన్నానికి అసలే రమ్మని పిలవ లేదు. ఉత్తరం ఆమెలోని ఆకలిని చంపేసింది అనుకుంటున్నారేమో వాళ్ళు.

కాని అకలి ఏ కష్టం వచ్చినా చావదని దాని చావు మనిషిచావు తర్వాతే నని బహుశా వాళ్ళు మరచిపోయి ఉంటారు.

* * *

మితని అత్తవారింటికి పంపడమే సబబు అని యింట్లోవారంతా నిర్ణయించ డంతో ఆమెకి బలవంతంగానైనా బయలు దేరక తప్పలేదు.

ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేస్తుంటే ఆఫీసు స్టాఫ్ అంతా పిచ్చిదాన్ని చూసి నట్టు చూసారు.

ఆ ఉద్యోగం సంపాదించి పెట్టడానికి అన్న పడిన కష్టం ఆమెకి బాగా గుర్తుంది. ఇది పోతే ఇంత మంచి ఉద్యోగం వస్తుందా అన్నమాట పక్క నుంచి అసలు ఉద్యోగం వస్తుందా అన్నది ఆమెని పీడిస్తున్న ప్రశ్న.

ఆమెని రైలెక్కించడానికి అన్నా వదినెలు స్టేషన్‌కొచ్చారు. వాళ్ళిద్దరూ కూడా ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయారు.

రైలు కూత పెట్టింది.

"నేను చెప్పినపని చేసావా లేదా?" అన్న వదినని అడుగుతున్నాడు.

"అదే ఎలా చెయ్యాలా అని అలోచిస్తున్నాను" అంది వదిన.

"ఏమిటి వదినా అది?" అడిగింది మిత.

జవాబు చెప్పలేదామె. తన చేతిలోని రుమాలుతో మిత నుదుటమీద గల బొట్టుని తుడిచేసి గబగబా రైలు దిగి పోయింది.

"మీ అత్తవారింటికి ఇలా వెళ్తే రేపు వాళ్ళు మమ్మల్నంటారు." జవాబిచ్చి వెనుదిరిగాడు అన్న.

ఇంకేమీ వినలేనట్టు పరుగు లంకించు కుంది రైలు.

మితకి అన్నా వదినెల మీద గల అభిమానం ఆ ఒక్క చర్యతో అంతరించి పోయింది.

అంతమంది ఎదుట వాళ్ళు చేసిన పని మితని సిగ్గుపడేలా చేసింది. కంపార్ట్ మెంట్‌లోకి చూసింది.

ఇంకా చాలామంది కళ్ళు ఆమెనే గుచ్చి గుచ్చి చూస్తున్నాయి. ఆ కళ్ళల్లో కదపల కొద్దీ జాలి. కదలి అంత సామభూతి.

ఆ చూపులను తప్పించుకోడానికా అన్నట్టు గబగబా టాయిలెట్ వైపుకు నడిచింది చాలాసేపు టాయిలెట్‌లో నిశ్శబ్దంగా నిలిచి ఉండిపోయింది

ఆమె బయటికొచ్చేసరికి అప్పుడే మూడొంతులమంది బెర్త్‌ల మీద వాలిపోతున్నారు. రిలీఫ్ గా అనిపించింది మితకి.

ఏ ఆలోచనా లేకుండా తనూ పడుకుండిపోయింది. ఆమె మీద నిద్రాదేవికి కూడా జాలి కలిగినట్టు లేదు. అడుగు దూరంలో నిలబడిపోయింది.

అత్తవారింటి ముందు ఆటో ఆగింది మిత. సామాన్లు తీసుకుని గేటుదగ్గరికి నడిచింది.

గేటు తీస్తోంది.

"మితా! అక్కడే ఆగు" అంగుమంది మామగారి కంఠం. ఆ కంఠంలో అనంతమైన అధికారం!

మిత ఆగిపోయింది.

మిత అత్తగారు గబగబా గేటు తీసుకుని బయటకి వచ్చింది.

"ఏమిటమ్మా ఈ వాలకం? ఇలా ఉన్నావేంటి? ఇంత చిక్కిపోయావేమిటి? శుక్రవారం ప్రొద్దున్న ఇలా గేనా ఇంటికి వచ్చేది" అంటూనే మిత నుదుట ఎర్రటి కుంకుమ దిద్దింది. గబగబా రెండు మట్టి గాజులు తొడిగా ఉన్న ఆమె కుడిచేతికి తొడిగింది. "ఇప్పుడు లోపలికి రామ్మా!"

మితకి అడుగులు తడబడుతున్నాయి. అంతసేపు బుద్ధిగా ఉన్న చీర కుచ్చెళ్ళు ఇప్పుడు అడ్డుకుంటున్నాయి కళ్ళు మసకలు క్రమ్ముతున్నాయి.

తల్లి కుంకుమ చెరిపేసింది ఒకరోజు! వదిన కుంకుమ చెరిపేసింది నిన్నటి రోజు!

ఆ పని వాళ్ళచేత చేయించారు తండ్రి, అన్నగారు.

కాని ఇప్పుడు జరిగినదేమిటి! ఓ అత్తగారు వితంతువు అయిన కోడలి నుదుట తనంత తానుగా కుంకుమ దిద్దింది.

ఇల్లంతా చాలా సందడిగా ఉంది.

మితని త్వరపెట్టి స్నానం చేయించింది అత్తగారు.

తర్వాత ఆకుపచ్చటి పట్టుచీర, జాకెట్టు, గాజులు ఆమెకి ఇచ్చింది. తనే స్వయంగా జడవేసి పూలు పెట్టింది.

ఇంట్లోని బంధువుల చూపులు మితకి గుచ్చుకుంటున్నాయి. వాళ్ళలో ఒక్కరు కూడా నోరు విప్పే సాహసం చేయలేదు.

తర్వాతి కార్యక్రమం నిర్విఘ్నంగా సాగింది.

అది దత్తత స్వీకార మహోత్సవం!

పాతికకీ ముప్పైకి మధ్య వయసున్న వంశోద్ధారక్ అనే వ్యక్తిని దత్తత



చేసుకున్నారు మిత అత్తమామలు.

తతంగమంతా త్వరత్వరగా పూర్తయిపోయింది.

బంధుమిత్రులంతా వెళ్ళిపోయే హడావిడిలో పడ్డారు.

అప్పుడు మిత మామగారు అందరినీ ఒకసారి హాల్లోకి రమ్మని పిలిచారు.

అంతా కూర్చున్నాక మితని పిలిచాడాయన.

పసుపు పచ్చటి బట్టల్లో కళకళలాడిపోతున్న మిత మామగారి దగ్గరికి నడిచింది.

ఆమె చేతికి ఓ శుభలేఖని ఇచ్చాడాయన. "మీ అమ్మగారింటికి కూడా ఇదీపాటికి చేరే ఉంటుంది. ముఖ్య బంధుమిత్రులంతా ఇక్కడే ఉన్నారు కనక వాళ్ళందరికీ ఇప్పుడు ఇస్తున్నాను." అంటూ అందరికీ పంచారు.

మా ఏకైక పుత్రుడు చి. వంశోద్ధారక్ కి చి.సౌ. మితని ఇచ్చి వివాహము చేయ నిశ్చయించినామని తెలియజేయుటకు సంతసిస్తున్నాము.

నివ్వెరపోయింది మిత

నిశ్చేష్టులయ్యారు బంధుమిత్రులు

ఆచారాలెంత ఆర్తనాదాలు చేసాయో!

సాంప్రదాయాలెంత సాహసాన్ని కోల్పోయాయో!

కాని మేరుపర్వతంలా నిలబడి ఉన్న మిత మామగారిని చూసి ఆయన వాక్ప్రవాహాన్ని విని ఏ శక్తి అడ్డుకునే

యత్నం చేయలేదు.

"మా కోడలు మహాలక్ష్మిలాగ కళకళ లాడుతూ ఏడాదిన్నర క్రితం మా ఇంట కాలుపెట్టింది. కాని మా ఏకైక పుత్రుని అకస్మిక మరణం సంభవించి ఆమెకి వితంతువు అన్న ముద్రపడింది.

ఇలాంటి సంఘటనేదైనా జరిగితే అయ్యో పాపం అని ఊరుకుంటారు కొందరు. ఆ పిల్లకి మళ్ళీ పెళ్ళి జరిగితే బాగుండుననుకుంటారు మరికొందరు.

కాని ఒక్కరు కూడా ఆమెని వివాహితని చేసేందుకో చెయ్యి వెయ్యరు. ఓ మాట చెప్పరు.

ఇరవై ఏళ్ళ ఈ చిన్నపిల్ల అరవై ఏళ్ళ వైరాగ్యాన్ని తెచ్చుకుని జీవించాలనడం అమానుషం. అనాగరికం.

అందుకే నేనీ పని చేసాను.

మా అబ్బాయి తన పితృలోకానికి తర్పణం వదలవలసినవాడు. శ్రార్ధం పెట్టవలసినవాడు. కాని తనకే పెట్టేవారు లేకుండా అయిపోయాడు.

ఆలా జరగడానికి వీల్లేదనే దత్తత చేసుకున్నాను. వంశోద్ధారక్ ఉత్తమోత్తముడు. అన్న సంగతి తన పై తరం సంగతి చూసుకుంటాడు.

నాకు ఆచారాలు అధికమే. కాని వాటి కోసం ఓ పసిపాపని బలి ఇచ్చే కసాయి వాడిని కాను నేను. మీరందరూ ఉండి వధూవరులను ఆశీర్వదించి వెడితే సంతోషం."

మిత కి అత్తమామలని గొంతెత్తి ప్రశంసించాలని ఉంది. తనను కన్నవారి కంటె, తనకంటె, ఈ సమాజం కంటె ఎంతో ఎత్తుకు ఎదిగిపోయిన వారిని వేనోళ్ళ కొనియాడాలని ఉంది.

కాని పెదవులు దాటి పలుకు రావడం లేదు.

మిత అత్తమామల కాళ్ళమీద వాలిపోయింది.

ఆమె కన్నీళ్ళు వారి పాదాలను అభిషేకిస్తున్నాయి.

తమకు తోచిన రీతిలో అభినందిస్తున్నాయి.

ఆనంద బాష్పాలు రాలుస్తూ ఉన్నాయి.